క్లుప్తంగా

హిందీ ఉపాధ్యాయురాలికి డాక్టరేట్



శారదను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, బంధువులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేటకు చెందిన వై.శారద హిందీ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం శారద ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆదిబట్ల మున్సిపాలిటీలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇందు వశిష్ఠకే కావ్యమే సంవేదన ఔర్ షిల్ప్ అనే అంశంపై డాక్టర్ విజయ్‌కుమార్ జాదవ్ పర్యవేక్షణలో పరిశోధనలు పూర్తి చేయగా.. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల హిందీ విభాగం నుంచి డాక్టరేట్‌ను పొందానని శారద తెలిపారు. ఈ సందర్భంగా శనివారం సహచర ఉపాధ్యాయులు, బంధుమిత్రులు ఆమెకు అభినందనలు తెలిపారు. పరిశోధనకు పూర్తి సహకారం అందించిన ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, గైడ్‌లకు శారద ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పోస్టుల మంజూరు హర్షణీయం

టీఎన్‌జీఓఎస్ నేత పర్వతాలు



తుక్కుగూడ: రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా ఏర్పాటైన మున్సిపాలిటీల్లో విధులు నిర్వహించడానికి ప్రభుత్వం ఉద్యోగుల కోసం పోస్టులు మంజూరు చేయడం హర్షణీయమని టీఎన్‌జీఓఎస్ సెంట్రల్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ టి.పర్వతాలు అన్నారు. శనివారం తుక్కుగూడ పురపాలక సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం 2018 ఆగస్టు మాసంలో నూతన మున్సిపాలిటీలను ఏర్పాటు చేసింది కానీ ఉద్యోగులను కేటాయించకుండా ఐదేళ్ల పాటు కాలయాపన చేసిందని విమర్శించారు. మున్సిపల్ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, గ్రేడ్–3 కమిషనర్లు, హెల్త్ అధికారులు, మేనేజర్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్ తదితర 316 పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. దీని ద్వారా ప్రజలకు మరింత సేవలు అందుతాయన్నారు. ఇందుకు గాను తమ సంఘం, మున్సిపల్ ఉద్యోగులు తరఫున సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు వృత్తిదారుల సంఘం రాష్ట్రస్థాయి సమావేశం

మీర్‌పేట: మీర్‌పేట పోస్టాఫీసు సమీపంలోని శివశంకర్‌నగర్‌లో ఆదివారం విశ్వకర్మ వృత్తిదారుల సంఘం రాష్ట్రస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుంకోజు యాదగిరిచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాళ్లబండి కుమారస్వామి, వృత్తి సంఘాల నాయకులు లెల్లెల బాలకృష్ణ హాజరవుతారని, కావున ఈ కార్యక్రమానికి నాయకులు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

తలకొండపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిపులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భరత్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ధర్నా చేశారు. ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్ ఇవ్వని కారణంగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. బోధనా రుసుం చెల్లించక పోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఫీజు చెల్లిస్తేనే పత్రాలు ఇస్తామనడంతో.. ఉన్నత విద్యను అభ్యసించేందుకు అనర్హులుగా మిగులుతున్నారని వెల్లడించారు. విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని.. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్కాలర్‌షిప్ విడుదల చేయాలని కోరారు. లేని పక్షంలో సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

కార్యకర్తకు పరామర్శ

ఆమనగల్లు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఆజిలాపురంలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న బీజేపీ కార్యకర్త శివలింగంను, శనివారం బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యుడు ఆచారి పరామర్శించారు.

జోరుగా మట్టి దందా!

- రావిర్యాల చిన్న కంచె, కలెక్టర్ కార్యాలయం వద్ద తవ్వకాలు
- రోజుకు వందల టిప్పర్లు తరలింపు
- ప్రకృతి సంపదను కొల్లగొడుతున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



రావిర్యాలోని ప్రభుత్వ భూమిలో చేపట్టిన మట్టి తవ్వకాలు

తుక్కుగూడ: అక్రమార్కులు ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు చేపడుతూ రూ. లక్షలు దండుకుంటున్నారు. పగలు, రాత్రి తేడాలేకుండా రోజుకు వందల టిప్పర్లు రవాణా చేస్తున్నా.. ప్రశ్నించాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తోందనే విమర్శలు వస్తున్నాయి. వివిధ పార్టీల నాయకుల అండతోనే మట్టి రవాణా జరుగుతుందనే అరోపణలు ఉన్నాయి.

అధికారుల అలసత్వంతోనే..

అధికారుల అలసత్వం కారణంగా మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల రెవెన్యూ పరిధిలోని చిన్న కంచె, కలెక్టర్ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ భూమిలో నెలరోజులుగా జోరుగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. మట్టి వ్యాపారులు ముఠాగా ఏర్పడి యథేచ్ఛగా మట్టి, మొరం తవ్వి లక్షల రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డూ అదుపు లేకుండా తవ్వకాలు చేపట్టడంతో అవి చెరువులను తలపిస్తున్నాయి.

లక్షల్లో వ్యాపారం

మున్సిపాలిటీ పరిధిలో విల్లాలు, బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయి. దీంతో మట్టి వ్యాపారుల ప్రభుత్వ భూములను లక్ష్యంగా చేసుకొని రాత్రి సమయంలో మట్టి తవ్వకాలు జరిపి టిప్పర్ల ద్వారా రవాణా చేస్తున్నారు. ఒక్కో టిప్పర్‌కు రూ.5వేల నుంచి రూ.6500 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మట్టిని రకాన్ని బట్టి, మార్కెట్‌లో డిమాండ్‌ను చూసి ధర పెంచుతూ వ్యాపారం చేస్తున్నారు. హైవే రోడ్డుపై మట్టి వ్యాపారం జోరుగా సాగుతున్నా రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొద్దిరోజుల క్రితం మహేశ్వరం, కందుకూరు మండలంలో ఎస్‌ఓటీ అధికారులు మట్టి మాఫీయాపై దాడులు చేసినా యథావిధిగా కొనసాగుతోంది. ఈ మట్టి వ్యాపారం వేనుక రాజకీయ నాయకులతో పాటు, వివిధ శాఖల ఉన్నతాధికారులు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను కాపాడి, మట్టి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఈ వ్యాపారులపై పీడీయాక్ట్‌లు పెట్టినప్పటికీ.. తిరిగి వ్యాపారం చేస్తున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

మట్టి తవ్వకాలు చట్టరీత్యా నేరం. రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి మట్టి మాఫీయాను అడ్డుకుంటాం. మట్టి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

–సైదులు, తహసీల్దార్

మాటలే తప్ప అభివృద్ధి ఏదీ?

- బీజేవైఎం కార్పొరేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి
- చెత్తకుప్పల వద్ద వినూత్న నిరసన



31వ డివిజన్‌లో చెత్త కుప్పల వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

బడంగ్‌పేట్: కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నామంటూ కార్పొరేషన్‌లో మేయర్, అధికారులు చెబుతున్నారు కానీ.. నిజానికి అభివృద్ధి ఎక్కడ జరిగిందో తెలపాలని బీజేవైఎం కార్పొరేషన్ అధ్యక్షుడు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా శనివారం వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. డివిజన్‌లో చెత్త కుప్పలు పేరుకుపోయిన ప్రాంతాల్లో ఐ లవ్‌యూ బడంగ్‌పేట్ అని ప్ల బోర్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. అధికారుల నిర్లక్ష్యానికి చెత్తకుప్పలు నిదర్శనమన్నారు. మేయర్ సొంత డివిజన్‌లో చెత్తను శుభ్రం చేసే నాథుడే లేడని విమర్శించారు. అధికారులు, మేయర్‌లు ఇరువురు బడంగ్‌పేట కార్పొరేషన్‌ను వందల కోట్లలో అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. మేయర్ డివిజన్‌తో పాటు అన్ని డివిజన్లలో చెత్త కుప్పలు గుట్టలుగా పేరుకొని ఉన్న ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్త కుప్పలతో నిండిన కార్పొరేషన్‌కు శానిటేషన్ విభాగంలో జాతీయస్థాయిలో అవార్డులు ఎలా ఇచ్చారో అని అనుమానం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు, పాలకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేని ఎడల పెద్దఎత్తున బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. బీజేపీ నాయకులు ఏ.మహేందర్, గోపాల్, సాయిసంతోష్, లక్ష్మణ్, సైదులు, నరేశ్, ప్రవీణ్‌గౌడ్, మల్లేశ్, శివ, శ్రీనివాస్, శ్రీరాములు, రాజేశ్ తదితరులు ఉన్నారు.

రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి



నూతన డైరెక్టర్‌గా ఎన్నికైన ఆనంద్‌ను సన్మానిస్తున్న చైర్మన్ తదితరులు

పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్

కందుకూరు: రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సకాలంలో సేవలందించాలని పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఇటీవల పత్రికల్లో వచ్చిన కథనాలపై సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలను ఇవ్వాలన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వచ్చే నెల మొదటి వారంలో సంఘం ద్వారా ఏర్పాటు చేయనున్నామన్నారు. క్వింటాల్‌కు సన్న రకం రూ.2320తో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.500 బోనస్‌తో కలిపి రూ.2820 అందిస్తామన్నారు. దొడ్డు రకానికి రూ.2300 చొప్పున సేకరించనున్నామన్నారు. అనంతరం నూతనంగా హెచ్‌డీసీసీబీ డైరెక్టర్‌గా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన పొట్టి ఆనంద్‌ను సంఘ సభ్యులతో కలిసి ఆయన ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. డైరెక్టర్లు ఎస్.శేఖర్‌రెడ్డి, ఎన్.నర్సింహా, జి.పర్వతాలు, జి.అంజమ్మ, కె.యశోధ, టి.జగదీశ్వర్ రెడ్డి, ఎస్.వెంకట్రామిరెడ్డి, ఎస్.పాండురంగారెడ్డి, ఎం.చంద్రు, సీఈఓ ఎన్.యాదగిరి ఉన్నారు.

నాణ్యమైన విద్య బోధించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ హేమలత



రావిర్యాల పాఠశాలలో వసతులపై ఆరా తీస్తున్న హేమలత

తుక్కుగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యనందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలతరాజుగౌడ్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల, మంఖాల్ గ్రామాల్లోని పాఠశాలలను ఆమె సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మౌలిక సదుపాయాల కల్పనకు తమవంతు కృషి చేస్తామన్నారు. ఆమె వెంట కౌన్సిలర్లు వై.శివకుమార్, విలాస్, రాజమౌని రాజు, నాయకులు జయరాజ్, బాల్‌రాజ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ బదిలీ



బదిలీపై వెళ్తున్న కమిషనర్ వాణిరెడ్డి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి తుక్కుగూడ మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో తుక్కుగూడ మున్సిపాలిటీ కమిషనర్ బి.వెంకట్రామ్ జల్‌పల్లి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 16వ తేదీన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వాణిరెడ్డి ఎనిమిది నెలలకుపైగా విధులు కొనసాగించారు. సెప్టెంబర్ 2వ తేదీన సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో, ప్రజా సమస్యల పరిష్కారమే వేదికగా నిర్వహించిన 'ఫోన్ ఇన్ ఆఫీసర్' కార్యక్రమంలో సైతం ఆమె భాగస్వాములయ్యారు. తాను పని చేసిన స్వల్ప కాలంలోనే ఇక్కడి పాలకమండలి, స్థానిక ప్రజల నుంచి ఊహించని ఆప్యాయత లభించిందని ఆమె సంతోషం వ్యక్తంచేశారు.

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని తుంగలో తొక్కిందని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి విమర్శించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ హాలులో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆమె అధికారులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రజలకు అమలు కానీ హామీలిచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించి మోసం చేసిందన్నారు. రైతులకు సంపూర్ణ రుణమాఫీ చేపట్టి రైతు భరోసా కింద రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రేవంత్ సర్కార్ అన్యాయం చేసిందన్నారు. హైడ్రా చట్టం తీసుకొచ్చి హైదరాబాద్‌ను ఆగమాగం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. అంతకు ముందు 56 మంది లబ్ధిదారులకు చెక్కులను ఆమె అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పాండు, వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ శైలజ, పలువురు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న శంకర్‌రెడ్డి

మీర్‌పేట: తెలుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్ సహకారంతో శనివారం కార్పొరేషన్ పరిధి లెనిన్‌నగర్‌లో గల హుడా కమ్యూనిటీ హాల్ వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. పేద ప్రజలు ఎక్కువగా నివసించే లెనిన్‌నగర్ ప్రాంతంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందజేయడంపై హర్షం వ్యక్తం చేశారు. దీంతో పాటు అంబులెన్స్ సౌకర్యం కల్పించి ఇతర వైద్య సేవలు అందిస్తున్నారని, ప్రజలు ఇలాంటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు ఇంద్రావత్ రవినాయక్, ఎడ్ల మల్లేశ్‌ముదిరాజ్, నాయకులు గాజుల మధు, చెవ్వ శ్రవణ్‌కుమార్, ఓర్సు స్వామి, హనుమంతు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మండల ప్రత్యేక అధికారి ముత్యాలు

తలకొండపల్లి: మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, ఎస్సీ వసతి గృహాలను ఆయన ఎంపీడీఓ శ్రీకాంత్‌తో కలిసి తనిఖీ చేశారు. వంటగది, ఆహార పదార్థాలు, కూరగాయలు, మరుగుదొడ్లు, వాటర్ ట్యాంక్, స్టడీ రూం, విద్యార్థులు, సిబ్బంది హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించి, చిన్నారులకు పాఠాలు బోధించాలని సూచించారు. ఎంపీఓ రఘు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

తలకొండపల్లి: సీసీ కెమెరాల ఏర్పాటుకు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈ మేరకు ఆయన అందజేసిన నగదును స్థానిక నాయకులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ శ్రీకాంత్‌కు అందజేశారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ.. సీసీ కెమెరాలతో నేరాలకు అడ్డుకట్ట పడనుందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా.. బాధ్యులను గుర్తించేందుకు పోలీసులకు ఎంతగానో ఉపయోగపడతాయని, తద్వారా బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జగదీశ్వర్, మాజీ సర్పంచ్ లలిత, జ్యోతయ్య, ఆంజనేయులు, సింగిల్‌విండో డైరెక్టర్లు యాదయ్య, శేఖర్, మల్లేశ్, శ్రీను, కోటీశ్వర్, పాండు, సత్తయ్య, మహేశ్, శ్రీరాములు, రవి, దీప్లా, కర్ణ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

పాష, నరహరిల వర్ధంతిలో సీపీఎం నేతలు

ఇబ్రహీంపట్నం: పేదల కోసం నిరంతరం పోరాడిన పాష, నరహరిలు ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.సామేల్ అన్నారు. మహబూబ్ పాష, నరహరిల వర్ధంతిని ఇబ్రహీంపట్నంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా వారు పోరాడారని, వెట్టి చాకిరి నుంచి ప్రజలను విముక్తి చేయడానికి ఉద్యమం చేశారని గుర్తుచేశారు. అమరుల ఉద్యమస్ఫూర్తితో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడతామని స్పష్టంచేశారు. వారి ఆశయ సాధనకు కృషి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సీహెచ్ జంగయ్య, ఎల్లేశ్, జగన్, బుగ్గరాములు, నర్సింహ్మా, వెంకటేశ్, శంకర్, ముసలయ్య, వీరేషం, స్వప్న, ఉస్నీష, యాదగిరి, భిక్షపతి, దాసు పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో ..

తుర్కయంజాల్: అమరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.కిషన్ అన్నారు. శనివారం మహబూబ్ పాషా, నరహరిల 35వ వర్ధంతిని పురస్కరించుకుని రాగన్నగూడలోని పార్టీ కార్యాలయంలో వారి చిత్రపటాలకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్ కుమార్, ఆశీర్వాదం, శంకరయ్య, కృష్ణ, మధు, మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: సీపీఎం పార్టీ దివంగత నేతలు, పోరాట యోధులు మహబూబ్ పాష, నరహరిల వర్ధంతి సభలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధి నక్కర్తమేడిపల్లి, చింతపట్ల, కొత్తపల్లి గ్రామాల్లో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, నాయకులు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చోరీల ముఠా గుట్టురట్టు

- పదిమందికి రిమాండ్. పరారీలో మరొకరు
- రూ.2.96 లక్షల విలువైన అల్యూమినియం ఫ్రేమ్స్, రూ.9.70 లక్షల నగదు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్స్

మహేశ్వరం: నిర్మాణంలో ఉన్న విల్లాల వద్ద అల్యూమినియం ఫ్రేమ్స్, ప్లేట్స్ దొంగిలించిన ముఠాను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.2.96లక్షల విలువ చేసే అల్యూమినియం ఫ్రేమ్స్, రూ.9.70 లక్షల నగదు, 11 సెల్‌ఫోన్లు, ఓ టాటా మెగా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి శనివారం మహేశ్వరం పీఎస్‌లో కేసు వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌కి చెందిన స్క్రాప్ వ్యాపారం చేసే కురువ రాములు, ఆత్మకూరుకు చెందిన కురువ వెంకటేశ్, కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా చించోలికి చెందిన రాథోడ్ సునీల్, నూతన్ రాథోడ్, వెంకటేశ్, సిద్దిపేటకు చెందిన కోనవేని రాకేశ్, తాడిశెట్టి శ్రీధర్, నారాయణపేట్ జిల్లా మక్తల్‌కు చెందిన కొత్త కుర్వ అనిల్, బోయ అనిల్, కురువ శివ, కోరి అనిల్ ముఠాగా ఏర్పాడ్డారు. ఈ నెల 21న రాత్రి ఒంటిగంట సమయంలో అల్యూమినియం ఫ్రేమ్స్ చోరీకి పాల్పడ్డారు. 23న రాత్రి మరోసారి ఫ్రేమ్స్ దొంగిలించి టాటా మెగా ఏస్ వాహనంలో లోడ్ చేసి తీసుకెళ్తుండగా కంపెనీలో పనిచేసే సెక్యూరిటీ గార్డులు ఆటోను వెంబడించారు. దీంతో ఆందోళన చెందిన ముఠా మన్సాన్‌పల్లి ఉప్పుగడ్డ తండా డబుల్ బెడ్రూం ఇళ్ల వెనుకనున్న చెట్ల పొదల్లో ఆటోను వదిలి పరారయ్యారు. శనివారం తెల్లవారు జామున 5 గంటలకు ముఠాలోని కొత్త కుర్వ అనిల్, బోయ అనిల్, కుర్వ శివ, కుర్వ వంశీ, కోరి అనిల్ ఆటోను తీసుకెళ్లేందుకు యత్నిస్తుండగా మఫ్టీలో ఉన్న పోలీసులు వారిని పట్టుకున్నారు. ముఠాలో పదిమందిని అరెస్ట్ చేయగా .. ఆత్మకూరుకు చెందిన వెంకటేశ్ పరారీలో ఉన్నాడు. కేసు ఛేదించిన సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు మధుసూదన్, వెంకట్‌రెడ్డి, క్రైమ్ పోలీసులను మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ ప్రశంసించి రివార్డులు అందజేశారు.